క్లుప్తంగా

ఓబీసీ మహిళలకు రిజర్వేషన్ కల్పించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): చట్టసభల్లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు శంకర్‌రావు, శ్రీహరిరావు కోరారు. హరనాథపురంలోని రాధే గెస్ట్ ఇన్‌లో విలేకరుల సమావేశంలో శనివారం వారు మాట్లాడారు. విజయవాడలోని ధర్నాచౌక్‌లో దీక్షతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కలెక్టర్లకు వినతిపత్రాలను సోమవారం అందజేయనున్నామని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాగమల్లేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, మాల్యాద్రి, విజయమ్మ, సలీమ్, కిరణ్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది విధులను బాధ్యతగా నిర్వర్తించాలని ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (ఫైనాన్స్) బాబు పేర్కొన్నారు. నగరంలోని నెల్లూరు టౌన్ – 1, 2 రెవెన్యూ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలను శనివారం చేపట్టారు. రెవెన్యూ కార్యాలయాల్లోని సిబ్బంది, వారి విధులు, నిర్ణీత సమయానికి హాజరవుతున్నారానే అంశాలను ఆరాతీసిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యుత్ రీడింగ్‌ను ప్రతి నెలా ఏడులోపు పూర్తి చేసి బిల్లులను అందజేయాలని సూచించారు. అక్టోబర్‌లో నెల్లూరు జిల్లా సర్కిల్ నూరు శాతం వసూళ్లను పూర్తి చేయడంపై సంతృప్తి వ్యక్తం చేసి ఎస్ఈ విజయన్‌ను అభినందించారు. మొండి బకాయిదారులకు మరో సర్వీస్ ఉంటే దాన్ని తొలగించాలని ఆదేశించారు. జనరల్ మేనేజర్ (రెవెన్యూ) సురేంద్ర, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): గుండెలో నొప్పితో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. హరనాథపురానికి చెందిన చంద్రశేఖర్, రాజేశ్వరి దంపతుల కుమారుడు సాయిసందీప్ (27). గుండెలో నొప్పిగా ఉందంటూ తన బాబాయి కృష్ణమూర్తికి శనివారం తెల్లవారుజామున ఫోన్ చేసి చెప్పారు. ఇంటికెళ్లి చూసేసరికి సందీప్ కిందపడిపోయి ఉన్నారు. దీంతో చికిత్స నిమిత్తం నగరంలోని ఓ హాస్పిటల్‌కు హుటాహుటిన తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు బాలాజీనగర్ పోలీసులకు మృతుడి తల్లి రాజేశ్వరి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

త్యాగరాజ స్మరణోత్సవాలు ప్రారంభం



నెల్లూరు(మినీబైపాస్): వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిరంలో భిక్షాటన పూర్వక త్యాగరాజ స్మరణోత్సవాలను భక్తిశ్రద్ధలతో శనివారం ప్రారంభించారు. స్వామివారికి పూజా కార్యక్రమాలను స్మరణోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి యనమండ్ర నాగదేవీప్రసాద్ ఆధ్వర్యంలో జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. త్యాగరాజ స్మరణోత్సవాలను వచ్చే ఏడాది మార్చి 30 నుంచి ఏప్రిల్ ఐదు వరకు పురమందిరంలో నిర్వహించనున్నామని వివరించారు. రామచంద్రమూర్తి, రామ్‌ప్రసాద్, సత్యనారాయణ, కామాక్షి, అరుణ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలపై అవగాహన



నెల్లూరు (టౌన్): రీసెంట్ ట్రెండ్స్ ఇన్ స్టాటిస్టిక్స్ అనే అంశంపై నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ మాజీ జాయింట్ డైరెక్టర్ పాపయ్యశాస్త్రి హాజరయ్యారు. ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన ప్రతిభ పరీక్షల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రొఫెసర్ సీఆర్‌రావు, ప్రిన్సిపల్ గిరి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ప్రసాద్‌రావు, సంఖ్యాక శాస్త్ర విభాగాధిపతి శ్రీనివాసులు, అధ్యాపకులు నాగశ్యామల, జయంతి, పీఆర్వో జోజీ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌మోపూరులో విశేష పూజలు

నెల్లూరు రూరల్: హిందూ ధర్మ ప్రచార వారోత్సవాలను పురస్కరించుకొని సౌత్‌మోపూరులో వేదగిరి లక్ష్మీనృసింహుడు, ఆదిలక్ష్మి అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు పూజలను వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. సుదర్శన హోమం, కుంకుమార్చన, కల్యాణోత్సవం తదితరాలను జరిపారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, ఆలయ ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అతివలే నిర్ణేతలు

- నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అధికం
- మొత్తం 2,63,370 ఓట్లు
- అందులో మహిళా ఓటర్లు 1,36,850 మంది



ఎన్నికల సిబ్బందితో సమావేశమైన కోవూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాపిరెడ్డి (ఫైల్)

కోవూరు: 2024లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఓటర్లు కీలకంగా మారనున్నారు. వారే కోవూరు అసెంబ్లీ స్థానం విజేతను నిర్ణయించనున్నారు. ఎమ్మెల్యే పదవిలో ఎవర్ని కూర్చోబెట్టాలి.. ఎవరిని దూరం చేయాలా అనే నిర్ణయం వారి చేతుల్లోనే ఉంది. కేంద్ర ఎన్నికల సంఘం గత నెల 26న విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం కోవూరు నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఈ జాబితా ప్రకారం కోవూరు నియోజకవర్గంలో ఓట్ల సంఖ్య స్వల్పంగా పెరిగింది. గతంలో మొత్తం 2,62,585 ఓట్లు ఉండగా, ప్రస్తుతం 2,63,370 ఓట్లు ఉన్నాయి. గతంలో పురుషులు 1,26,328 మంది ఉండగా, ప్రస్తుతం 1,26,501 మంది ఉన్నారు. గతంలో మహిళలు 1,36,237 మంది ఉండగా, ప్రస్తుతం 1,36,850 మంది ఉన్నారు. గతంతో పోలిస్తే మహిళా ఓటర్లు 613 మంది పెరిగారు. మొత్తంగా పురుషుల కంటే మహిళా ఓటర్లు 10,349 మంది అధికంగా ఉన్నారు. దీంతో 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కోవూరు స్థానం నిర్ణేతలుగా మహిళలు మారనున్నారు.

నేడు ఓటరు నమోదుకు అవకాశం

కేంద్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు 2024 జనవరిలో ప్రచురించనున్న తుది ఓటర్ల జాబితాకు సంబంధించి ఎన్నికల సిబ్బంది ఓటరు నమోదు, మార్పులు, చేర్పులను పూర్తి చేశారు. పారదర్శకంగా ముసాయిదా జాబితాను రూపొందించి విడుదల చేశారు. అందులోని అభ్యంతరాలు, మార్పులు, చేర్పులకు దరఖాస్తు చేసుకునేందుకు డిసెంబరు 12 వరకు అవకాశం కల్పించారు. అందులో భాగంగా ఆదివారం, డిసెంబరు 2,3 తేదీలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు చేపడుతున్నారు. వచ్చే ఏడాది జనవరిలో తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు.

మండలం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు
బుచ్చిరెడ్డిపాళెం	1-78	33,086	35,751	6
కోవూరు	79-156	30,587	33,536	6
కొడవలూరు	157-221	19,676	21,599	0
విడవలూరు	212-262	19,891	21,217	7
ఇందుకూరుపేట	263-324	23,261	24,747	0
మొత్తం	324	1,26,501	1,36,850	19

వేడుకగా రామాలయం ప్రారంభం



సీతారాముల చిత్రపటాలను ఆవిష్కరిస్తున్న భువనేశ్వరి పీఠాధిపతి కమలానందభారతి



అన్నప్రసాద వితరణను ప్రారంభిస్తున్న డీసీఎమ్మెస్ చైర్మన్ చలపతిరావు

కొడవలూరు: మండలంలోని గండవరం పంచాయతీ పరిధిలోని ఆదర్శనగర్‌లో నూతనంగా నిర్మించిన సీతాలక్ష్మణ హనుమత్ సమేత రామచంద్రస్వామి ఆలయ ప్రారంభోత్సవాన్ని శనివారం వేడుకగా నిర్వహించారు. ఆలయంలో సీతాలక్ష్మణ సమేత శ్రీరాముడి చిత్రపటాలను విజయవాడ భువనేశ్వరి పీఠాధిపతులు కమలానంద భారతి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం పీఠాధిపతులు భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం విశేష పూజలు, హోమాలు, శిఖర ప్రతిష్ఠను అత్యంత వైభవంగా నిర్వహించారు. అల్లం సత్యనారాయణ, అరుణ దంపతుల దాతృత్వంలో నిర్మించిన అభయాంజనేయస్వామి విగ్రహాన్ని దాతలతో ప్రతిష్ఠింపజేశారు. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాత్రి ప్రదర్శించిన కోలాటం, కూచిపూడి, భరతనాట్యం, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వీఎస్‌యూ ఎన్‌ఎస్ఎస్ వలంటీర్లకు అభినందన



ఎన్‌ఎస్ఎస్ వలంటీర్లను అభినందిస్తున్న వీసీ జీఎం సుందరవల్లి

వెంకటాచలం: దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన నా మట్టి–నా దేశం కార్యక్రమంలో పాల్గొన్న విక్రమ సింహపురి వర్సిటీ(వీఎస్‌యూ) ఎన్‌ఎస్ఎస్ వలంటీర్లను ఆ వర్సిటీ వీసీ జీఎం సుందరవల్లి శనివారం అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ గత నెల 30, 31 తేదీల్లో ఢిల్లీలో నా మట్టి– నా దేశం కార్యక్రమ ముగింపు వేడుకలు జరిగాయని తెలిపారు. ఈ వేడుకల్లో జిల్లా నుంచి 54 మంది ఎన్‌ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొనగా, వారిలో 16 మంది వీఎస్‌యూ వలంటీర్లు ఉన్నారు. ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో వర్సిటీ ఎన్‌ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొనడం అభినందనీయమన్నారు. సామాజిక కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొని మంచిపేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఎన్‌ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఉదయశంకర్, సునీత, విద్యాప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఓ బాపిరెడ్డి

కోవూరు: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల, పీఆర్‌ఆర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను కోవూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి బాపిరెడ్డి శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో నీటి వసతి, విద్యుత్ సరఫరా, తదితర సదుపాయాలు ఉన్నాయా..లేవా అని పరిశీలించారు. అన్ని వసతులు ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. వీసీ వెంట ఆర్‌ఐ రమణయ్య, సీనియర్ సహాయకుడు కిరణ్ ఉన్నారు.

రైతు భరోసా జాబితాలను పరిశీలించుకోవాలి



మాట్లాడుతున్న ఏడీఏ రాజ్‌కుమార్

ఇందుకూరుపేట: వైఎస్సార్ రైతు భరోసా రెండో విడతకు అర్హులైన రైతుల జాబితాలను ఆర్బీకేల్లో ప్రదర్శించామని ఏడీఏ ఏ రాజ్‌కుమార్ తెలిపారు. ఇందుకూరుపేటలోని ఆర్బీకేలో గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా రెండో విడత నగదును ఈ నెల 7న రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుందని తెలిపారు. రైతుభరోసాతో పాటు 2023 ఖరీఫ్‌కు సంబంధించి పంట నమోదు వివరాలను ఆర్బీకేల్లో ప్రదర్శించామని చెప్పారు. ఈ జాబితాలను రైతులు పరిశీలించుకుని సవరణలుంటే చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వీహెచ్ఏ దీక్షిత, రైతులు పాల్గొన్నారు.

పూడ్చిపెట్టిన శవానికి రీ పోస్టుమార్టం



శవానికి పోస్టుమార్టం చేసేందుకు సన్నాహాలు చేస్తున్న అధికారులు

విడవలూరు: పూడ్చిపెట్టిన శవానికి పదకొండు నెలల తర్వాత రీ పోస్టుమార్టం నిర్వహించిన ఘటన మండలంలోని పార్లపల్లిలో శనివారం చోటు చేసుకుంది. తహసీల్దార్ రమాదేవి తెలిపిన వివరాల మేరకు..పార్లపల్లిలోని ఎస్సీ కాలనీకి చెందిన పొంతగాని వెంకటసుబ్బయ్య (58) పదకొండు నెలల క్రితం మతిస్థిమితం లేక కొడవలూరు రైల్వేగేటు సమీపంలో రైలు కింద పడి మృతి చెందగా ఖననం చేశారు. ఇటీవల వెంకటసుబ్బయ్య మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ భార్య పొంతగాని కృష్ణమ్మ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రైల్వే సీఐ బుజంగరావు, ఎస్సై అరుణకుమారి ఆధ్వర్యంలో శవాన్ని వెలికితీసి డాక్టర్ ప్రసాద్‌రెడ్డితో రీ పోస్టుమార్టం నిర్వహించారు.

నేడు,రేపు మంత్రి కాకాణి పర్యటన

పొదలకూరు : మండలంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆది, సోమవారాల్లో పర్యటించనున్నట్లు ఎంపీడీఓ నగేష్‌కుమారి శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు నందివాయ గ్రామంలో మాతమ్మ ఆలయ నిర్మాణానికి చేపట్టనున్న శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు తోడేరులో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం మండలాధికారులతో సమీక్ష, సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. మండలాధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

10న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ముత్తుకూరు: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 10న నిర్వహించనున్నట్లు ఎంపీపీ గండవరం సుగుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం జరిగే సమావేశంలో మండలాభివృద్ధిపై సమీక్షించనున్నట్లు చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

యువకుడి వైద్యానికి ఆర్థిక సాయం

పొదలకూరు : పట్టణంలోని యాదవవీధికి చెందిన హేమ్‌చరణ్‌కు అమరావతి పాఠశాల విద్యార్థులు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. పేద కుటుంబానికి చెందిన హేమ్‌చరణ్ గత కొద్దిరోజుల క్రితం విషజ్వరానికి గురయ్యాడు. రూ.లక్షలు వెచ్చించినా జ్వరం తగ్గకపోవడంతో యువకుడి వైద్యానికి సోదరి స్థానిక దాతల సహకారం కోరారు. దీంతో స్పందించిన అమరావతి స్కూల్ యాజమాన్యం విద్యార్థుల ద్వారా రూ.24,184 నగదు పోగుచేసి హేమ్‌చరణ్‌కు అందజేసింది.

మౌలిక వసతుల పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులను మండల వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు కే కిరణ్‌కుమార్ శనివారం పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు రవీంద్రతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనతరం ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ పాఠశాలలో రెండు గదులకు శ్లాబ్ నిర్మించాల్సి ఉందన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిశేషయ్య, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



నెల్లూరు(బారకాసు): ఆర్ అండ్ బీ కావలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణప్రసాద్‌ను ఆ శాఖ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా శాఖ సభ్యులు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ మస్తానయ్య, కార్యదర్శి సురేష్, ట్రెజరర్ రాజా, నవీన్‌కుమార్, ఉపాధ్యక్షుడు నారాయణ, రాజారావు, జకీరుద్దీన్, ప్రభాకర్, వీరయ్య, రామకృష్ణ, గౌస్‌మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణకు కృషి



మనుబోలులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

వెంకటాచలం: బాల్య వివాహాల నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ ముజీబున్నీసా పేర్కొన్నారు. వెంకటాచలం మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాల కట్టడిపై శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ బాల్య వివాహాలతో బాలికలు ఆరోగ్యపరమైన సమస్యలను ఎక్కువగా ఎదుర్కొంటారని తెలిపారు. ఆడపిల్లలు ఉన్నత చదువులు చదివించేలా తల్లిదండ్రులను ప్రోత్సహించాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాలికలకు 18 ఏళ్లు నిండిన తరువాతే వివాహం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మందా కవిత, కసుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రవళిక, ఐసీడీఎస్, సచివాలయ, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మనుబోలు: ఆరోగ్యవంతమైన సమాజం కోసం బాల్య వివాహాలను అరికడదామని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ సమావేశ మందిరంలో బాల్య వివాహాల కట్టడిపై శనివారం అవగాహన కల్పించారు. బాలికలకు 18 ఏళ్లు నిండిన తరువాతే వివాహం చేయాలన్నారు. చిన్నవయస్సులో వివాహాలు చేయడం వల్ల ఆరోగ్య సమస్యల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఎస్సై అజయ్‌కుమార్ మాట్లాడుతూ 18 ఏళ్లలోపు ఆడపిల్లలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఎవరైనా అతిక్రమించి వివాహాలు చేస్తే జైలు శిక్ష, జరిమానా తప్పదని హెచ్చరించారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం బాల్య వివాహాల నివారణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, జెడ్పీటీసీ చిట్టమూరు అనితమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ, డీటీ శ్రీకాంత్‌రెడ్డి, ఏపీఓ రాజమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు అజయ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వర్షంతో నిమ్మ రైతులకు ఊరట



వర్షంతో పచ్చబడిన నిమ్మతోటలు

పొదలకూరు : మండలంలో రెండ్రోజులుగా కురుస్తున్న చిరుజల్లులు నిమ్మతోటలు సాగుచేస్తున్న రైతులకు ఊరటనిస్తున్నాయి. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవకపోవడంతో నిమ్మతోటలు బెట్టకు వచ్చాయి. ఈ పరిస్థితుల్లో రెండ్రోజులుగా కురుస్తున్న చిరుజల్లులు నిమ్మచెట్లకు ఉపశమనం కలిగిస్తున్నాయని రైతులు తెలిపారు. ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో కూడా వర్షపాతం ఆశించిన స్థాయిలో నమోదయ్యే అవకాశం లేదని వాతావరణశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. దీంతో వ్యవసాయాధికారులు తొందరపడి నార్లు పోసుకోవద్దని ఆర్బీకేల ద్వారా రైతులకు సమాచారం అందజేస్తున్నారు. బోరు బావులు ఉన్న రైతులు నీటి సదుపాయాన్ని బట్టి నార్లు పోసుకునేందుకు సమాయత్తం అవుతున్నారు. మండలంలో అధిక సంఖ్యలో రైతులు నిమ్మతోటలపై ఆధారపడి జీవిస్తున్నారు. తోటలు ఎక్కడా ఎండు దశకు చేరుకోకున్నా వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో బెట్టకు వచ్చాయి. ఈ పరిస్థితుల్లో నీటి లభ్యత లేకుంటే పూతపూయడం తగ్గుతుంది. దీంతో వేసవిలో ధరలు పలికే సమయంలో కాయల దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ముత్తుకూరులో ముసురు

ముత్తుకూరు: సముద్ర తీరప్రాంతమైన ముత్తుకూరు మండలంలో శనివారం ముసురు పట్టింది. మధ్యాహ్నం వరకు దట్టమైన మబ్బులు కమ్ముకుని సన్నని చినుకులతో వర్షం కురిసింది. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. మండలంలో 29.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

ట్రాఫిక్‌కు అడ్డంగా ఉన్న చెట్ల తొలగింపు



పొదలకూరు : పట్టణంలోని ట్రాఫిక్‌కు అడ్డంకిగా మారి విద్యుత్ తీగలు తగులుతూ ప్రమాదకరంగా ఉన్న చెట్లను ఆర్అండ్‌బీ అధికారులు శనివారం తొలగించారు. పట్టణంలో సిమెంటురోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో ఆక్రమణలను తొలగించారు. ఈ క్రమంలోనే చాలారోజులుగా ట్రాఫిక్‌కు అడ్డంకిగా ఉన్న చెట్లను తొలగించారు. నిబంధనల ప్రకారం అటవీశాఖ అనుమతులు తీసుకుని ఆర్అండ్‌బీ అధికారులు చెట్లను తొలగించడంతో వ్యాపారులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణం



విశేష అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లోని శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని శనివారం నేత్రపర్వంగా నిర్వహించారు. దేవస్థానంలో రెండ్రోజులుగా లక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తుల ప్రతిష్ఠ మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం రాత్రి లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం నిర్వాహక కమిటీ కార్యదర్శి వాకాటి శ్రీనివాసులురెడ్డి, సభ్యులు ఎం శ్యామ్‌ప్రసాద్, దాసరి శ్రీనివాసులు, కొమ్మి వేణుగోపాల్, మురళి, చొప్పా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



మనుబోలు: మండలంలోని వెంకన్నపాళెం దళితవాడలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు చిలకపాటి నరసింహాచార్యుల ఆధ్వర్యంలో ఆంజనేయుడి విగ్రహానికి సంప్రోక్షణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. గతంలో విగ్రహ ప్రతిష్ఠ విషయంలో దళితులు రెండు వర్గాలుగా విడిపోవడంతో వివాదం నెలకొంది. వైఎస్సార్‌సీపీ నాయకుల చొరవతో ఎట్టకేలకు దళితులంతా ఒకే తాటిపైకి వచ్చి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠకు పూనుకున్నారు. ఈ సందర్భంగా భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అడపాల శివకుమార్‌రెడ్డి, ఆవుల మనోహర్‌రెడ్డి, వాసిరెడ్డి రామిరెడ్డి, ఎంపీటీసీ మమత తదితరులు పాల్గొన్నారు.